JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 10-03-2026
Medchal - Malkajgiri | Tuesday 10-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 283
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 283 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





పోలీసు అకాడమీలో ఏర్పాటు చేసిన తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరయ్యాను. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమే. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది. దానిని ఎదుర్కోవడానికి ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చాం. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి పోలీసు ఉన్నతాధికారులు కొన్ని ప్రతిపాదనలు అందించారు. వీటిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం. ఆ కమిటీలో విశ్లేషించి సాధ్యాసాధ్యాలను బట్టి నిర్ణయం తీసుకుంటాం.

## సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమే

**భవిష్యత్తులో రాబోయే సవాళ్లను ఎదుర్కొనడానికి పోలీసు శాఖ సర్వసన్నద్ధం కావలసిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాబోయే 25 సంవత్సరాలకు అవసరమైన కార్యాచరణపై చర్చించి ప్రణాళికలు రూపొందించుకోవాలని పోలీసు శాఖకు సూచించారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో సుదీర్ఘ కాలం తర్వాత నిర్వహించిన పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఫ్యూచర్ రెడీ కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల పోలీసు ఉన్నతాధికారులు ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. పోలీసింగ్‌కు సంబంధించి భవిష్యత్తులో చేపట్టాల్సిన మార్పులు, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యల ఆవశ్యకతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో కొత్త తరహా నేరాలు పెరగకుండా సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నేరాలను నిరోధించడం, నేరస్థులను త్వరగా గుర్తించడానికి AI టెక్నాలజీని వినియోగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ పోలీస్ అకాడమీ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "శాంతి భద్రతలు కాపాడటంలో దేశంలో తెలంగాణ ఒక మెరుగైన రాష్ట్రంగా

...మిగతాది 2 లో

## పీఎం కిసాన్ నిధుల విడుదల



- **అకౌంట్లోకి డబ్బులు ఆరోజే**
- **ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద అందిస్తున్న రూ.2000 నిధులు మార్చి రెండో వారంలోనే రైతుల ఖాతాల్లో జమ**

**జయభేరి, న్యూఢిల్లీ:**

రైతులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందబోతేంది. మారో వారం రోజుల్లో రైతుల ఖాతాల్లోకి నిధులు జమ కానున్నాయి. అవును దేశంలో రైతున్నలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద అందిస్తున్న రూ.2000 నిధులు మార్చి రెండో వారంలోనే రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. పీఎంకిసాన్ పథకం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 22వ విడత పెట్టుబడి సాయం కోసం దేశవ్యాప్తంగా రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే మార్చి రెండో వారంలోనే ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమకానున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రైతులు ఈ కేవైసీ వంటివి పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే కేవలం ఈకేవైసీ ఉన్నవారికి మాత్రమే నిధులు జమ అవుతాయి. అయితే ఈ పథకం కింద 2025 నవంబర్ 19న 21వ విడత నిధులు రూ.2000 రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో 22 విడత నిధుల కోసం దేశవ్యాప్తంగా ఉన్న రైతులు వేచి చూస్తున్నారు. ముందుగా 22వ విడత ఫిబ్రవరి చివరి నాటికి విడుదలవుతుందని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత హోలీ పండుగలోపు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని, అయితే ఫిబ్రవరి ముగిసి, హోలీ పండుగ కూడా పూర్తయినప్పటికీ ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. కొన్ని నివేదికల ప్రకారం.. మార్చి 13న అంటే వచ్చే వారం రోజుల్లో

...మిగతాది 2 లో



## కవితకు నోటీసులు

- **ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ**
- **కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది**
- **ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు**

**జయభేరి, హైదరాబాద్, మార్చి 9 :**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది.

...మిగతాది 2 లో

## ఎన్నికల హామీని నిలబెట్టుకున్న నారా లోకేష్

- **దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే రూ.294.20 కోట్ల పరిపాలన అనుమతులు**
- **భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని సైతం తట్టుకునేలా పటిష్టమైన డిజైన్**

**జయభేరి, విజయవాడ, మార్చి 9 :**



మంగళగిరి నియోజకవర్గంలో మరో ఎన్నికల హామీ నిలబెట్టుకున్నారు ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. తన సొంత నియోజకవర్గంలోని తాడేపల్లి మహానాడు ప్రాంత ప్రజల దశాబ్దాల కలను నారా లోకేష్ నెరవేర్చారు. తాడేపల్లి పట్టణం సీతానగరం మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి లోకేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన 0.9 కి.మీ నుంచి 2.610 కి.మీల వరకు

...మిగతాది 2 లో



## పునరుద్ధరించుకున్న నల్ల చెరువు

2 లో

## NTPCకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వండి

- **సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ**

**జయభేరి, హైదరాబాద్, మార్చి 9 :**



రామగుండం NTPC థర్మల్ పవర్ ప్రాజెక్టు సెకండ్ ఫేజ్ లో భాగంగా 2,400 మెగావాట్ల సామర్థ్యంతో మిగిలిన మూడు పవర్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి NTPC చర్యలు చేపట్టిందని.. మొదటి ఫేజ్‌లో లాగే రెండవ ఫేజ్‌లో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85% విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే సరఫరా చేయనుందని పేర్కొన్నారు. 3 మార్చి, 2026 న తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యధికంగా 18,139 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయ్యిందని. రానున్న రోజులలో తెలంగాణలో విద్యుత్ డిమాండ్ మరింతగా పెరగనుందని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో అవసరమైన విద్యుత్ ఉత్పత్తి వనరులను సమకూర్చుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిసిందని.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల విద్యుత్ రంగం మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో "జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రిడ్ స్థిరత్వాన్ని పరిరక్షించడానికి రాష్ట్రంలో 5000 నుంచి 6000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని తెలియజేశారన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో లక్ష మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుందని భట్టి విక్రమార్క తెలిపారని దీనికి అనుగుణంగా రాష్ట్రంలో 2,400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం కూడా తీసుకున్నట్లు

...మిగతాది 2 లో



## ఉచితాల వరదలో విజయ్

మొదటిపేజీ తరువాయి

## పీఎం కిసాన్ నిధుల విడుదల

పీఎం కిసాన్ 22వ విడతకు సంబంధించిన ప్రకటన వెలువడే అవకాశం ఉందని అంటున్నారు. ఆ రోజున దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలో పర్యటించనున్నారని.. ఆ సందర్భంగా రైతులకు 22 విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే మీరు పీఎం కిసాన్‌ను సంబంధించి కేవైసీ చేసుకోకపోయినా, లేదా ఆధార్ లింక్ లేకపోయినా, అధికారిక పోర్టల్‌లో మీ ID లింక్ చేయడం వంటికి అప్‌డేట్ చేసుకోకపోతే మీకు 22వ విడత నిధులు అందకపోవచ్చు. కాబట్టి వెంటనే మీ దగ్గర్లోని మీసేవా కేంద్రాలకు వెళ్లి వాటిని అప్‌డేట్ చేసుకోండి.

## సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమే

గుర్తింపు పొందింది. అందుకు పోలీసు శాఖను అభినందిస్తున్నా. అయితే, 2047 లక్ష్యాలను చేరుకోవడానికి మనమంతా ఎంపవర్ కావలసిన అవసరం ఉంది. ఫ్యూచర్ రెడీ కోసం పోలీసు శాఖ చేసిన ప్రతిపాదనలు, అనుసరించాల్సిన విధానం, దానికి చట్ట బద్ధత కల్పించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శితో కూడిన కమిటీని నియమిస్తాం. ఆర్థిక, న్యాయ, సాంకేతిక, పరిపాలన పరమైన అంశాలను చర్చించిన తర్వాత చట్టరూపం కల్పించే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుంది.

పోలీసు శాఖను ఎంపవర్ చేయడానికి అవసరమైన నిధులు కేటాయించడంలో ఇబ్బంది లేదు. కానీ ఫలితాలొచ్చే విధంగా ఆ నిధులు సద్వినియోగం అవుతాయన్న ఒక విశ్వాసం కల్పించాలి. మనకున్న ఫిజికల్ క్రైమ్, మన ఎకోసిస్టమ్ ఆధారంగా మాన్యువల్స్ రాసుకున్నాం. ఇప్పుడు పరిస్థితుల్లో చాలా మార్పులొచ్చాయి. నేర స్వరూపమే పూర్తిగా మారిపోయింది. సైబర్ క్రైమ్, డ్రగ్స్ వంటి కొత్త సమస్యలొచ్చాయి. పోలీసు అధికారులు మొట్టమొదట సమస్య ఏంటో అర్థం చేసుకోగలగితే సగం సమస్య పరిష్కారమైనట్టే. సమస్య అర్థంకానప్పుడు వేగంగా పరిష్కరించాలని ప్రయత్నించినా ప్రయోజనం ఉండదు. ఉద్యోగం వచ్చింది కదా అని సమాజంతో పనిలేదన్న భావన రావొద్దు. బాధ్యత మరింతగా పెరిగిందని గుర్తించాలి. ఉద్యోగం వచ్చిందని ఆటో మోడ్‌లోకి వెళ్లి రిలాక్స్ అయ్యారంటే నష్టం జరుగుతుంది. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా లాంటి మెట్రోపాలిటన్ నగరాలు అనేక సమస్యలతో సతమతవుతున్నాయి.

మెట్రో నగరాల్లోని పరిస్థితులను పోలీసు శాఖ కచ్చితంగా నేర్చుకోవలసిన అంశాలున్నాయి. ప్రజలు సమస్య వచ్చినప్పుడు మొట్టమొదటగా సహాయం కోసం చూసేది పోలీసుల వైపే. అది పోలీసుల్లోని మంచి తనం కావొచ్చు. వ్యవస్థ కావొచ్చు. తీవ్రవాదం లేదా ఇతర సమస్యలను ఎదుర్కొనడానికి గ్రేహౌండ్స్, ఆక్టోపస్, నార్కోటిక్స్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఇలా రకరకాల వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. సిబ్బంది విషయంలోనూ అనేక సమస్యలున్నాయి. తక్కువ జనాభా ఉన్న ప్రాంతానికి ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతానికి ఒకే విధంగా సిబ్బంది కేటాయించడంకన్నా జనాభా ప్రాతిపదికన సిబ్బంది రేషనలైజేషన్‌పై ఆలోచనలు చేయండి.

శాఖాపరంగా చర్చించుకుని మానవ వనరులను ఒక పద్ధతి ప్రకారం వినియోగించుకోవాలి. ఒక పర్పస్ కోసం ఒక ఫోర్స్‌ను తయారు చేసిన తర్వాత ఆ పర్పస్ పరిష్కారమైన తర్వాత ఆ ఫోర్స్‌ను ఇతరత్రా వినియోగించడంపై సమీక్ష చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడమే కాకుండా నేర పరిశోధన, ఇతరత్రా పోలీసు శాఖలో ఉన్న సమాచారానికి సంబంధించిన డేటాను ICCC కంట్రోల్ రూమ్‌తో కనెక్ట్ చేయాలి. ఏ పోలీస్ స్టేషన్‌లో ఏ సమాచారం కావాలన్నా నిమిషాల్లో ఆన్‌లైన్‌లో పొందే విధంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకునేలా ఉండాలి. ఉన్నతస్థాయిలో ఉన్న అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో అనుసంధానం ఏర్పాటు చేసుకోగలిగితే కిందిస్థాయిలో ఉండే సమస్యలు అర్థమవుతాయి. పోలీస్ శాఖ మానవీయ దృక్పథం కలిగి ఉండాలి. కింది స్థాయి సిబ్బందికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చినప్పుడే మంచి ఫలితాలు, గుర్తింపు వస్తుంది. 2002 సంవత్సరంలో పోలీస్ రిట్రీట్ కార్యక్రమం తర్వాత ఇప్పుడు మళ్లీ రిట్రీట్ జరుపుకుంటున్నాం. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, నేరాలు, నేరాల స్వరూపం చర్చించుకుని అవగాహన కల్పించినప్పుడు తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడుతుంది.." అని దిశానిర్దేశం చేశారు.

## ఎన్నికల హామీని నిలబెట్టుకున్న నారా లోకేష్

కృష్ణా నది కుడివైపు రూ.294.20 కోట్లతో వరద రక్షణ గోడ ను నిర్మించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి లోకేష్ చర్యలు తీసుకుంటున్నారు. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే రూ.294.20 కోట్ల పరిపాలన అనుమతులు సాధించడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని సైతం తట్టుకునేలా పటిష్టమైన డిజైన్‌తో మహానాడులో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారుకేవలం సాధారణ గోడ కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేయనున్నారు.

పైల్ రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలతో పాటు నీటి ధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే మహానాడు కాలనీ, సుందరయ్య నగర్ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50వేల మంది ప్రజలు వరద సమస్య నుంచి విముక్తి పొందుతారు. రాజధాని అమరావతి పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి65కు రిటైనింగ్ వాల్ రక్షణగా నిలవనుంది.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, తాడేపల్లి టౌన్ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## NTPCకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వండి

తెలిసిందన్నారు. అతి తక్కువ ఖర్చుతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో థర్మల్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో NTPC కి దేశంలోనే విశేషమైన అనుభవం ఉందని.. పూర్తి 4000 మెగావాట్ల ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీకరించుకోవడంలో NTPCకి తగిన స్వేచ్ఛను ఇచ్చినట్లయితే, థర్మల్ పవర్ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన విద్యుత్ ను తక్కువ ధరకే ఉత్పత్తి చేసి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి NTPC సిద్ధంగా ఉందన్నారు. తద్వారా, ప్రభుత్వానికి, ప్రజలకు ఇద్దరికీ లబ్ధి చేకూరనుందని తెలిపారు.

అధునాతన సాంకేతికత పరిజ్ఞానంతో తక్కువ ధరకే విద్యుత్ ను ఉత్పత్తి చేస్తుండటంతో ఇతర దక్షిణాది రాష్ట్రాలు కూడా NTPC నుంచి విద్యుత్ కొనుగోలు చేయడానికి, అవసరమైన ఒప్పందాలు (PPAs) చేసుకుంటాయని విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఎంతో అనుభవం ఉన్న NTPC, సెకండ్ ఫేజ్ లో భాగంగా రామగుండంలో ఏర్పాటు చేయనున్న 2400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం (PPA) చేసుకునేలా కృషి చేయాలని కోరారు. అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మేలు చేకూర్చే రామగుండం థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్రం మంత్రి రాసుకొచ్చారు.

# ఉచితాల వరదలో విజయ్

**తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీ ద్వారా ప్రకటిస్తున్న ఉచితాల వరద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న పథకాలకు రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆయన హామీలు అటు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఇటు విమర్శలకు పదును పెడుతున్నాయి.**



విజయ్ అనుసరిస్తున్న ఈ వ్యూహం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు ఆయన రాజకీయ పరిణతిని ఇది ప్రశ్నార్థకం చేస్తోంది. కనీసం వార్డు మెంబర్‌గా కూడా అనుభవం లేని విజయ్, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసి ఇలాంటి భారీ హామీలు ఇవ్వడంపై మేధావి వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అనుభవం సున్నా అయిన వ్యక్తి, రాష్ట్ర ఖజానాపై పడే వేల కోట్ల భారాన్ని ఎలా మేనేజ్ చేస్తారనేది ప్రధాన ప్రశ్న. స్టాలిన్ ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కష్టపడుతుంటే, విజయ్ అంతకు రెట్టింపు ఇస్తాననడం అసాధ్యమైన హామీ గా ప్రజలు భావించే ప్రమాదం ఉంది. ఇది ఆయనను ఒక 'సీరియస్ పొలిటీషియన్ గా కాకుండా, కేవలం ఓట్ల కోసం ఆశ చూపే సినిమా గ్లామర్ నేతగా ముద్ర వేసే అవకాశం ఉంది.విజయ్ పార్టీపై యువతలో ఉన్న ప్రధాన ఆశ మార్పు. దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల మధ్య నలిగిపోతున్న తమిళనాట ఒక కొత్త రాజకీయ సంస్కృతి వస్తుందని ఆశించిన వారికి, ఈ ఉచితాల ప్రకటనలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఇతర రాజకీయ నాయకులలాగే విజయ్ కూడా ఉచితాలనే నమ్ముకోవడం వల్ల, ఆయన ప్రత్యేకత ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది.

మార్పు కోరుకునే ఓటర్లు కేవలం డబ్బు లేదా వస్తువుల కోసం ఓటు వేయరు. వారు వ్యవస్థాగత మార్పును కోరుకుంటారు. ఈ క్రమంలో విజయ్ తనకున్న యూత్ ఐకాన్ ఇమేజ్‌ను కోల్పోయి, పాతతరం రాజకీయాలనే పునరావృతం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారమే పరమావధిగా ఆయన దేనికైనా తెగిస్తున్నారనే సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం గెలవడమే లక్ష్యంగా ఇలాంటి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిధులు లేవు అనే సాకుతో చేతులెత్తేస్తారేమో అన్న భయం సామాన్యుల్లో కలగడం సహజం. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీలను ఢీకొట్టాలంటే ఈ మాత్రం షో ఉండాలని విజయ్ వర్గం వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆయన మాటల్లోని నిజాయితీని ఎంతవరకు నమ్ముతారన్నదే ఇక్కడ అసలు పాయింట్. తమిళ రాజకీయాల్లో ఉచితాలు అనేవి గెలుపు గుర్రాలుగా మారిన చరిత్ర ఉంది.

అందుకే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ఆయన పథకాల వరద పారిస్తున్నారు.

అయితే, సినిమా స్క్రిప్ట్ లాగా హామీలు ఇవ్వడం సులభం కానీ, బడ్జెట్ అంకెలను సరితూచడం కష్టమనే నిజాన్ని ఆయన త్వరలోనే గ్రహించాల్సి ఉంటుంది.తమిళనాడు రాజకీయాల్లో అధికారంలో వాటా ఇస్తామంటూ సరికొత్త ప్రకటనతో సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డీఎంకే వంటి బలమైన పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కూటమి కట్టాలని ఆయన చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన మొదటి బహిరంగ సభలోనే మిత్రపక్షాలకు రెడ్ కార్పెట్ పరిచిన విజయ్ ఆఫర్‌పై తొలత కాంగ్రెస్, వీసీకే వంటి పార్టీలు ఆసక్తి చూపినప్పటికీ అవేవీ డీఎంకే కూటమిని వీడలేదు.

ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి తన మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటులో కొంత వెసులుబాటు కల్పించి వారు బయటకు వెళ్లకుండా కట్టడి చేయడంలో విజయం సాధించారు. దీంతో ప్రస్తుతం విజయ్ రాజకీయ క్షేత్రంలో ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ డీఎంకే లేదా అన్నాడీఎంకే కూటముల్లోస్థిరపడటంతో టీవీకే భవిష్యత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పన్రుట్టి రామచంద్రన్ వంటి కొద్దిమంది మద్దతు తప్ప విజయ్‌కు బలమైన రాజకీయ అండ లభించలేదు.

యువత , తొలిసారి ఓటు వేసే వారిపైనే ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు కూడా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం , అందులో పేర్కొన్న అంశాలను ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఈ వ్యక్తిగత ఆరోపణలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

## కవితకు నోటీసులు

రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందించింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోంది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడుపులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాదిస్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

# పునరుద్ధరించుకున్న నల్ల చెరువు

హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించుకున్న కూకట్ పల్లి నల్ల చెరువును నేడు ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. నగరంలో గత పదేళ్లలో కబ్జాలు, ఆక్రమణలకు గురైన చెరువులు, నాలాల పునరుద్ధరణ ప్రారంభించినప్పుడు కొందరు ఆరోపణలు, విమర్శలు చేశారు. ప్రజాహితం కోసం అవన్నీ మౌనంగా భరించా. ఈ రోజు ఫలితాలు చూస్తుంటే, ప్రజల స్పందన చూస్తుంటే వాళ్ల ఆరోపణలే నాకు ఆశీర్వాదాలుగా మారాయనిపిస్తోంది. పేదవాడిని ఇబ్బంది పెట్టడం, ఇళ్లు కూలగొట్టడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. వరదలు వచ్చినపుడు పేదలు ముంపు బాధితులుగా మిగలకూడదు అనేది మా తపన. చెరువులు, నాలాలను ఆక్రమించుకున్న వారికి నా సూచన. మీకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రకృతి పునరుద్ధరణ కు సహకరించాలి. పునరుద్ధరించిన చెరువుల వద్ద మహిళలకు స్టాల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తాం. పిల్లల కోసం చెరువుల ఒడ్డున ఆటస్థలాలు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. నగరంలోని చెరువులన్నింటినీ పునరుద్ధరించుకుందాం. ప్రజలు అండగా నిలవాలని కోరుతున్నా.



**"హైదరాబాద్ నగరంలో రోడ్లను విస్తరించుకుందాం. చెరువులను పునరుద్ధరించుకుందాం. నాలాల ఆక్రమణలను తొలగించుకుందాం. పిల్లలకు క్రీడా మైదానాలు కట్టుకుందాం. అభివృద్ధి చెందుతున్న ఒక మంచి నగరంగా అభివృద్ధి చేసుకుందాం.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.**

**జయభేరి, హైదరాబాద్ :**

కూకట్‌పల్లిలో హైడ్రా పునరుద్ధరించిన నల్లచెరువు ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. చెరువులో గంగమ్మతల్లికి హారతినిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. "దేశంలోని మెట్రో నగరాల్లో హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. అయితే, ఆక్రమణలు తొలగించి, కాలుష్యం నివారించి మూసీ నదిని పునరుద్ధరించుకోవలసిన అవసరం ఉంది. లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు. హైడ్రాను ఏర్పాటు చేసినప్పుడు, హైడ్రా పనులు ప్రారంభించినప్పుడు చాలా మంది నాపై విమర్శలు చేశారు. ఇందులో నాకెలాంటి దురుద్దేశం లేదు. నల్లచెరువును పునరుద్ధరించిన తర్వాత వేలాది మంది మోహాల్లో ఆనందం చూసినప్పుడు సంతోషం కలిగింది.

పునరుద్ధరించిన చెరువు పార్కుల చుట్టూ వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేద్దాం. స్టాల్స్ పెట్టాలి. పిల్లలు ఆడుకోవడానికి స్థలాల్లేవు. చెరువుల ఒడ్డున ఆటస్థలాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ ప్రాంతంలో ఉన్న చెరువులన్నింటినీ పునరుద్ధరించుకుందాం. ఇలాంటి పనులు చేసుకునప్పుడు నిజంగానే కొందరికి నష్టం కలిగి ఉండొచ్చు. పేదవారు ఎవరికీ అన్యాయం చేయను. అలాంటి వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను సిద్ధం చేశాం. నిజంగా నష్టం జరిగిన వారికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకుందాం. నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నా. ఈ ప్రాంతాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకోవాలి. ఈ ప్రాంతాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం. అహ్మదాబాద్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగానది రివర్ ఫ్రంట్ నిర్మించుకుని ఆ నగరాలను అభివృద్ధి చేసుకున్నప్పుడు మనమెందుకు మూసీని ప్రక్షాళన చేయకూడదు" అని ప్రశ్నించారు.

# ఆలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపుతా..

■ **సాగు, తాగు నీటిని ఇబ్బంది లేకుండా కృషిచేస్తాం.. ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 09 :**





ఆలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపుతానని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని దాతారుపల్లి గ్రామంలో పెద్ద చెరువు నిండి అలుగుపోస్తుండడంతో బీర్ల అయిలయ్య స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు,రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఎండాకాలంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఆలేరు నియోజకవర్గంలోని చెరువులన్నీ గోదావరి జలాలతో నింపుతున్నామని, ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా కృషిచేస్తానని తెలిపారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ, నవాబ్ పేట రిజర్వాయర్, తపాస్ పల్లి ప్రాజెక్టుల నుండి ఆలేరు నియయోజకవర్గానికి నీరు తీసుకొస్తానని తెలిపారు. రైతులకు సంవత్సరం పొడవునా సాగునీరు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని,చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పెరిగి రైతులకు,ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజలు చెరువులను సంరక్షించుకొని నీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎండాకాలంలోనూ ఆలేరు నియోజకవర్గంలోని ప్రతీ చెరువు నిండుకుండలా ఉంటుందని,బీర్ల అయిలయ్య కాకుండా నీళ్ల అయిలయ్య అని ప్రజలు తనను పిలుచుకుంటున్నారని తెలిపారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్ పుష్పాల నర్సింహులు, దాతారుపల్లి గ్రామ సర్పంచ్ సరితా భాస్కర్, కాంగ్రెస్ నేతలు జనగాం ఉపేందర్‌రెడ్డి, గుండ్లపల్లి భరత్‌గౌడ్, కానుగు బాలరాజు, చీర శ్రీశైలంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా పరిశ్రమలులో భద్రతా ప్రమాణాలు పాటించాలి

■ **ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవఅధ్యక్షులు గని శెట్టి డిమాండ్**

**జయభేరి, పరవాడ:**




అనకాపల్లి జిల్లాలో 205 ఫార్మా పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్నాయని వీటిలో అధిక ప్రాధాన్యత భద్రతకి ఇవ్వాల్సిన అవసరం ఉందని కానీ యాజమాన్యాలు భద్రతని గాలికి వదిలేస్తున్నాయని భద్రతా ప్రమాణాలు పాటించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో 55వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 25 మంది ఫార్మా పరిశ్రమల్లో వివిధ ప్రమాదాలులో మృతి చెందారని గనిశెట్టి గుర్తుచేశారు. 59 మంది అస్వస్థత గురవడం, గాయపడం జరిగిందన్నారు. ఫార్మా ప్రమాదం జరిగినప్పుడు ఐఏఎస్ మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీ నివేదిక ఏమైందని గని శెట్టి ప్రశ్నించారు. కార్మిక శాఖ మంత్రి వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. కేవలం కూటమి ప్రభుత్వం వచ్చిన యాజమాన్యాలు బరితెగించి ప్రమాదాలను దాచిపెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఫార్మా పరిశ్రమల్లో భద్రత ఆడిట్ నిర్వహించాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏర్పాటుచేసిన కమిటీ నివేదికను వెంటనే బయట పెట్టాలని డిమాండ్ చేశారు.ఫార్మా సిటీలో భద్రతకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశ్రమలో జాయిన్ అయిన ప్రతి కార్మికులకు భద్రతపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రీ పోతి నాయుడు, డి దేముడు, కే ఎంకు నాయుడు , వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత జాబితాలోని ప్రతి ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించాలి

■ **బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్**

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 9 :**



యాదగిరిగుట్ట పట్టణంలోని నిషేధిత జాబితాలో పెట్టిన ప్రతి ఇళ్లకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్ తెలిపారు. యాదగిరిగుట్టలో రిజిస్ట్రేషన్ యాక్ట్ 1977 సెక్షన్ 22ఏను తీసుకురావడాన్ని నిరసిస్తూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమిచ్చిన స్థలంలో ప్రజలు తమ కష్టంతో ఇళ్లను నిర్మించుకున్నారని,ఇప్పుడు వాటిని నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

వెంటనే ఆ యాక్ట్‌ను సవరించి 760 ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇప్పటికైనా మాయమాటలు చెప్పడం ఆపాలని,బేషరతుగా ఇళ్లను రెగ్యులరైజ్ చేసి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, జిజేపి రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీనివాస్, జిజేపి నేతలు మల్లారెడ్డి,కర్రె ప్రవీణ్, గుంటుపల్లి మహేశ్వరి సత్యనారాయణ, ఆకుల చంద్రమౌళి, గంధమల్ల మహేష్,గోపగాని ప్రసాద్, జెల్ల భానుచందర్, బోడ రాధ సురేష్, కర్రె మాధవి, ఆవుల సత్యనారాయణ, పరుగుల సురేష్, దొమ్మాట ప్రభాకర్, తాళ్ల భాస్కర్ రెడ్డి, రంగ సత్యం, అశోక్, శ్యాం సుందర్, బందారపు మల్లేష్, బుచ్చి బాబు, శ్రీశైలం అజయ్, వంశీ, నరేష్, వీరేందర్, శ్రీనాథ్, శ్యామ్, లక్ష్మయ్య, కొన్నె ప్రశాంత్, గోవర్ధన్, కోల విక్రం, శేఖర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

■ **పెండింగ్ పనులను దశల వారీగా పూర్తి చేస్తాం - చైర్మన్ జాం రవి**

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 9:**



ముడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు ఎస్సీ కాలనీలో పంచాయితీరాజ్ నిధుల కింద సుమారు 12 లక్షల 88 వేల రూపాయలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ పవన్ కుమార్ లు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో పెండింగ్ లో ఉన్న పనులను దశల వారీగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏ ఈ ఈ సన షాహిన్, మున్సిపల్ డీ ఈ ఈ స్ఫూర్తి, కౌన్సిలర్ ర్యాకల నీరజ్ గౌడ్, మేనేజర్ ఉష, రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## భారత సర్వీసు ఫలితాల్లో సత్తా చాటిన అభ్యర్థులకు ఎమ్మెల్యే జీఎంఆర్ అభినందనలు

**జయభేరి, దేవరకద్ర :**

అఖిల భారత సర్వీసు 2025 ఫలితాల్లో సత్తా చాటిన తెలుగు అభ్యర్థులకు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జై మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ అభినందనలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో, రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం ద్వారా సాయం అందుకున్న తెలంగాణ అభ్యర్థుల్లో 20 మంది సివిల్స్ తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలవడం సంతోషకర విషయం అన్నారు. గత ప్రభుత్వం పేదల బిడ్డలు బర్లు, గొర్లు కాసుకుని బతకాలని భావించింది. జై కాంగ్రెస్ మన ప్రజా ప్రభుత్వం వారి విద్యకు అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చి ఐఎఎస్ లు, ఐపీఎస్ లు గా ఎదగాలని తోడుగా నిలుస్తుంద అన్నారు.కొత్తగా అఖిల భారత సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులు దేశ ప్రగతిలో భాగస్వాములై, మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తు... మీరు ఏ కేడర్ లో ఉన్నా తెలంగాణ పునర్నిర్మాణంలో మీ వంతు పాత్ర పోషించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు.

## వెల్ డన్ క్రికెట్ టీం ఇండియా

■ **భారత క్రికెట్ జట్టుకు గోవర్ధన్ నాయి అభినందన.**



**జయభేరి, దేవరకద్ర :**

ఐసిసి పురుషుల టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న భారత జట్టుకు మహబూబ్ నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోకోఆర్డినేటర్, దేవరకద్ర మండలం బస్వాయిపల్లి ఉపసర్పంచ్ గోవర్ధన్ నాయి అభినందనలు తెలిపారు. టీ 20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో న్యూజిలాండ్ పై ఘనవిజయం సాధించి విశ్వవిజేతగా నిలిచిన టీమిండియా జట్టుకు ఆయన హృదపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ అద్భుతమైన విజయం అసాధారణమైన నైపుణ్యాలు, సంకల్పం మరియు జట్టు కృషిని ప్రతిబింబించిందన్నారు. టోర్నీలో వారు అత్యద్భుతమైన ప్రతిభ కనబరిచారన్నారు. ఈ విజయం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వం, సంతోషంతో నింపిందన్నారు. వెల్ డన్ టీమ్ ఇండియా అని గోవర్ధన్ నాయి అన్నారు.





## నేడు ఘనంగా ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం ,వాడ చీపురుపల్లి గ్రామ పంచాయితీలు పరిధిలో గల 14 గ్రామాల ఆరాధ్య దేవతగా పేరుగాంచిన,భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం మంగళవారం 10వ తేదిన అంగరంగ వైభవంగా కనుల పండుగగా ఘనంగా అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణం నాయుడు తెలిపారు మంగళవారం వేకువజాము నుంచి భక్తులు పసుపు,కుంకుమ, చీర సారె సమర్పిస్తూ అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు అమ్మవారి జాతరలో భాగంగా కోలాటం నృత్యాలు,తీన్‌మార్ డప్పుల నడుమ అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగింపు నిర్వహించి,రాత్రి 9.00 గంటలకు అమ్మవారి ఆలయంలోకి తోడుకువెళ్తారని తెలిపారు.

## బి.సి.ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ



**జయభేరి, పరవాడ:**

ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో విద్యుత్ బి.సి. ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఈబిసిఈ డబ్ల్యు ఏ) ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది.సంఘం సెక్రటరీ ఎస్. రామకృష్ణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సిఎండి పృధ్వి తేజ్ ఇమ్మాడి ని కలిసి డైరీని అందజేశారు.ఈ సందర్భంగా కేవలం ఆవిష్కరణకే పరిమితం కాకుండా ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న కీలక సమస్యలపై విశ్లేషణాత్మక చర్చ జరగడం విశేషం.ప్రధానంగా 2026 నూతన పీఆర్సీ అమలు,ఫీడర్ క్యాడర్ నియామకాల ద్వారా సంస్థ పనితీరును మెరుగు పరచడం వంటిఅంశాలను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు టి.వనజ, ఎస్.హరిబాబు, మరియు వెంకట సూర్య ప్రకాష్ పాటు పలువురు సీజీఎంలు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మరాజు,ప్రధాన కార్యదర్శి వి. అనూరాధ మాట్లాడుతూ బి.సి. ఉద్యోగుల హక్కుల సాధనలో రాజీపడబోమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గుణవంతుడు,డిప్యూటి సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ఫైనాన్స్ సెక్రటరీ చిన్నబాబు, ఈపీడీసీఎల్ ప్రెసిడెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

■ **మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి**



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 9:**

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు కమిషనర్ చంద్రశేఖర్ తో కలిసి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సొంతింటి కల ప్రతి పేదవాని కల అని, అందుకే ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు గాదె వెంకటేశ్, గూదే వెంకటేష్, సుధాకర్ రెడ్డి, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ కమలాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దెమర్రిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 9:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా 4వ రోజు మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని ఉద్దెమర్రి గ్రామంలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ పవన్ కుమార్ లు పాల్గొన్నారు. అనంతరం రహదారులను శుభ్రం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రహదారులను శుభ్రం చేసి , పిచ్చి మొక్కలను తొలగించినట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నరసింహులు యాదవ్, కౌన్సిలర్లు దోసకాయల లత, పెద్దిరెడ్డి శ్రీలత , రాజీగాళ్ల లత, గోవర్ధన్ రెడ్డి, ర్యాకల నీరజ్ గౌడ్, చిన్నలచ్చ సరిత శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ , విష్ణు గౌడ్, ప్రభాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, నరసింహులు గౌడ్, యాదగిరి, వెంకటేష్, వివిధ పార్టీల స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 09 :

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మండల సి ఆర్ పి భాస్కర్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మొదటి రోజు పాఠశాల స్థాయిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈనెల 16వ తేదీన జిల్లా కేంద్రంలో 20వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వేతనాలు చెల్లించడంతోపాటు గత 20 సంవత్సరాలు 29 రోజుల సమ్మె కాలపు వేతనాలని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎం ఐ ఎస్ నమిత డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్, సిఆర్పి వీరస్వామి, చందర్, శారద, మెసెంజర్ జహంగీర్ పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ




జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 09 :

తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆశ్రయం ఇన్నావేషన్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులను జిల్లా విద్యాధికారి కే సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుండి జరుగు పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ జానీ ఆఫ్షన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి, ఉపాధ్యాయులు, ఆశయం ఇన్నోవేషన్ మిషన్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ చీర్ల మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం


- చిర్ల రమేష్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్




జయభేరి, మేడ్చల్ :

క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిర్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడ్చల్ వారియర్స్ క్రికెట్ ట్రోఫీ పోటీలను డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతకు అండగా నిలవాలని నిర్వాహకుడు చీర్ల రమేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, చిర్ల రమేష్, రాఘవేందర్ గౌడ్, రమణా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చేప రాజు, రామస్వామి, వరదారెడ్డి, రేగురాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ హాస్పిటల్ లో మహిళ దినోత్సవ వేడుకలు



జయభేరి, మేడ్చల్ :

మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని సీఎంఆర్ కాలేజీ సెక్రటరీ వసంత లత అన్నారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎంఆర్ హాస్పిటల్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మెడికల్ కళాశాల మహిళల విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం కళాశాల సెక్రటరీ వసంత లత మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ మహిళలు మానసికంగా దృడంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ కాలేజీ చైర్మన్ గోపాల్ రెడ్డి, డీన్ వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

జయభేరి, దేవరకొండ :





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) దేవరకొండ డివిజన్ కస్తూరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దేవరకొండలోని పెన్షనర్స్ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా శక్తి, భారతీయ సనాతన సంస్కృతిలో స్త్రీ స్థానం, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వంటి అంశాలపై కార్యక్రమంలో విస్తృతంగా చర్చించారు. ఉపాధ్యాయులు, మహిళా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని మహిళా శక్తికి ఘనంగా వందనం చేశారు. కార్యక్రమానికి దేవరకొండ మున్సిపల్ ఛైర్పర్సన్ పున్న శైలజ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారతీయ సనాతన సంస్కృతిలో మహిళలకు అత్యున్నత స్థానం ఉందని పేర్కొన్నారు. మహిళలను గౌరవించే సమాజంలోనే శాంతి, అభివృద్ధి, సమృద్ధి నెలకొంటాయని ఆమె అన్నారు. కుటుంబాన్ని సంస్కారవంతంగా తీర్చిదిద్దే ప్రధాన బాధ్యత తల్లిదేనని, మంచి తల్లి మంచి సమాజానికి పునాది వేస్తుందని ఆమె తెలిపారు.

మహిళలు విద్య, విజ్ఞానం, పరిపాలన, ఆర్థిక రంగం, సామాజిక సేవ వంటి అన్ని రంగాల్లో ముందుకు వచ్చి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు మరింత ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయంలో స్త్రీని శక్తి స్వరూపిణిగా భావించారని తెలిపారు. వేదాలలో చెప్పబడిన యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అనే వాక్యాన్ని ఉదహరిస్తూ చరిత్రను పరిశీలిస్తే గొప్ప మహనీయుల వెనుక గొప్ప తల్లుల పాత్ర స్పష్టంగా కనిపిస్తుందని ఆమె పేర్కొన్నారు.

మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి మహానాయకుడిని తీర్చిదిద్దినది ఆయన తల్లి జిజియాబాయి అని ఆమె గుర్తుచేశారు. చిన్నప్పటి నుంచే ధర్మం, దేశభక్తి, ధైర్యం వంటి విలువలను తన కుమారునిలో నాటిన జిజియాబాయి గొప్పతనం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని ఆమె అన్నారు. అలాగే ప్రపంచానికి ఆధ్యాత్మిక దిశను చూపించిన స్వామి వివేకానంద వంటి మహనీయుడి వెనుక ఆయన తల్లి భువనేశ్వరి దేవి వంటి మహోన్నత స్త్రీశక్తి నిలిచిందని ఆమె వివరించారు. చిన్నప్పటి నుంచే తన కుమారునికి ధైర్యం, సేవాభావం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను బోధించి గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దిన తల్లి భువనేశ్వరి దేవి ఆదర్శమూర్తి అని ఆమె తెలిపారు. భారతమాత గొప్పతనాన్ని వివరిస్తూ స్వాతంత్ర్య సమరయోధుడు ఖుదిరాం బోస్ వంటి యువ వీరులు కూడా తల్లి భూమి కోసం ప్రాణత్యాగం చేయడానికి ముందుకు రావడం భారతీయ సంస్కృతిలోని తల్లితన మహిమను ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. భారతదేశంలో దేశాన్ని భారతమాత గా భావించి పూజించే సంప్రదాయం కూడా సనాతన సంస్కృతిలోని గొప్పతనాన్ని తెలియజేస్తుందని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా దేవరకొండ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 100 మంది మహిళా ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. విద్యా రంగంలో వారి సేవలను గుర్తించి శాలువాలు, సన్మాన పత్రాలతో గౌరవించారు. ఉపాధ్యాయులుగా మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్న మహిళా ఉపాధ్యాయినుల సేవలను పలువురు నాయకులు ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహిళలు విద్యా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మంచి ఉపాధ్యాయురాలు అనేక తరాల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి కలిగి ఉంటుందని వారు అన్నారు. మహిళల విద్యాభివృద్ధి, ఆత్మవిశ్వాసం పెంపొందితే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర బాధ్యులు ఇరుగు శ్రీరాములు, కట్టెబోయిన శ్రీనివాస్, కొమిరెల్లి భాస్కర్ రెడ్డి దేవరకొండ డివిజన్ నాయకులు శ్రీనివాస్, గణేష్, రమేష్,ధనుంజయ,వినోద్, శ్రీధర్, వెంకట్ రెడ్డి, సైదులు, వెంకటేష్, భాస్కర్ రెడ్డి, సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. మహిళా సాధికారతకు సంఘం ఎప్పటికీ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. మొత్తంగా ఈ కార్యక్రమం మహిళా శక్తి గొప్పతనాన్ని, భారతీయ సనాతన సంస్కృతిలో స్త్రీ స్థానం ఎంత గొప్పదో ప్రతిబింబించేలా నిర్వహించబడింది. మహిళా శక్తికి వందనం సనాతన విలువలతో ప్రగతి పథంలో అభినందనం అనే సందేశంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా ముగిసింది.




## నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మంగళవారం ఆయా మండలాలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 10 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే 11:00 గంటలకు భూత్పూర్ మున్సిపాలిటీ రైతు వేదికలో అడ్డాకుల, మూసాపేట్, భూత్పూర్ మండలాలకు చెందిన రైతులకు స్పింకర్ల పంపిణీ, భూత్పూర్ మండలం హస్నాపూర్ గ్రామ రైతులకు హార్టికల్చర్ ఇక్విమెంట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అనంతరం వెటర్నరీ హాస్పిటల్ వద్ద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొంటారు.మధ్యాహ్నం 2 గంటలకు దేవరకద్ర మండలం జీనుగరాల గ్రామంలో సీసీ కుంట, కౌకుంట్ల, దేవరకద్ర మండలాలకు చెందిన రైతులకు స్పింకర్ల పంపిణీ, అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహిస్తున్న భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొంటారు.కావున ఈ కార్యక్రమాలలో ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్ లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళ కాంగ్రెస్, సేవదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## చింతల తండాలో నూతన రోడ్డు పనులకు శంకుస్థాపన




జయభేరి, పీఏ పల్లి :

పీఏ పల్లి మండల పరిధిలోని చింతల తండా గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల చిరకాల కోరిక మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈ రహదారి పనులను ప్రారంభించారు. సర్పంచ్ రామావత్ శారద రఘు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో రహదారుల పాత్ర కీలకమని, నూతన రోడ్డు నిర్మాణంతో తండా వాసుల రవాణా కష్టాలు తీరతాయని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు సర్పంచ్ రామావత్ శారద (రఘు),ఉప సర్పంచ్ రామావత్ లాలు,మాజీ ఎంపిటిసి సుజాత హనుమ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్ వార్డ్ మెంబర్లు రామావత్ శారద రాంబాబు, సరోజ దశ్రు,పంచాయతీ కార్యదర్శి గణేష్, మోత్య, నాగేష్, సుర, శంకర్, దప్పు శ్రీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దృఢమైన యువత బలమైన భారత్ లక్ష్యం కోసం ప్రధాన్ మంత్రి సంసద్ ఖేలో

- క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించిన బిజెపి నాయకులు

జయభేరి, షాద్ నగర్, మార్చి 09 :



దృఢమైన యువతరం బలమైన భారతదేశం కోసం భారత్ ఖేలో కార్యక్రమం.పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ నేతృత్వంలో నిర్వహించనున్న "ప్రధాన్ మంత్రి సంసద్ ఖేలో" క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణతో పాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం షాద్‌నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వంశీ కృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.....ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలతో ప్రారంభమైన "సంసద్ ఖేలో" కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించి బలమైన భారత దేశ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో వంటి క్రీడలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువకులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని అన్నారు. మార్చి 9 నుండి 24వ తేదీ వరకు జట్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని, అలాగే ఏప్రిల్ 9 నుండి 24వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. యువకులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున ఆన్‌లైన్ ద్వారా జట్లు నమోదు చేసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్, మురళి, మల్చం ఇస్నత్, శ్రీనివాస్, శ్రీనివాస్ చారి,మోహన్ సింగ్,లక్ష్మీకాంత్ రెడ్డి,ప్యాట అశోక్,లష్కర్ నాయక్,మహేందర్ రెడ్డి,రాజు,వడ్ల అరవింద్,మఠం ఋషి కేష్,సుధాకర్ అప్పా,క్యామ మహేష్,రాజేశ్వరి,సందీప్ యాదవ్,వినోద్ నాయక్,మహేష్,రఘు గౌడ్,రామకృష్ణ యాదవ్,అనిల్ గౌడ్,ప్రశాంత్ గౌడ్,గజ్జల ప్రవీణ్,బల్ రెడ్డి,భాస్కర్ పటేల్,కొత్త సతీష్ తదితరులు పాల్గొన్నారు..

# మంచినీటి సమస్యపై బీఆర్ఎస్ ధర్నా

జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 297,298 కిష్టాపూర్, పూడూరు డివిజన్ పట్టణాల్లో నెలకొన్న మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్కిల్ కార్యాలయం ముందు సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాళీ బిందెలు, కుండలతో నిరసన తెలుపుతూ, కొన్ని కుండలు పలగొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ కాళ్లు మొక్కుతూ ప్రజల తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని వేడుకొన్నారు. అనంతరం వినతి పత్రం కమిషనర్ కి అందజేశారు.

భాస్కర్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మేడ్చల్ సర్కిల్ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఎండాకాలం ప్రారంభం కాకముందే అనేక ప్రాంతాల్లో మంచినీరు అందడం లేదని, కొన్నిచోట్ల డ్రైనేజీ కలిసిన మురుగునీరు వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య సమస్యలపై అధికారులను అడిగితే వాహనాలకు కనీసం డీజిల్ కూడా లేదని సమాధానం ఇస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు తీవ్రమైన నేటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు వచ్చేది అని భాస్కర్ యాదవ్ పేర్కొన్నారు. మాజీ మంత్రి ,మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జలమండలికి పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లిన స్పందన లేదన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ లో విలీనం చేసిన తర్వాత ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కోట్ల రూపాయల ఆస్తి పన్నులు వసూలు చేసినప్పటికీ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిష్టాపూర్, పూడూరు డివిజన్ ప్రజలకు తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ కౌన్సిలర్ నిషిత రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఉమా నాగరాజు, బిఆర్ఎస్ నాయకులు గణేష్, వీర్ల చంద్రశేఖర్, శైలేందర్, విష్ణు చారి, ప్రభాకర్, మల్లికార్జున స్వామి, సందీప్ గౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## PHD పట్టా వచ్చిన సందర్భంగా తల్లిదండ్రుల, ఆశీర్వాదం

జయభేరి, చందంపేట :




చందంపేట మండలం గాగిలాపురం గ్రామంలో క్రైస్తవ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు ఓయూ ఉద్యమ నేత Dr. మాసారం ప్రేమ్ కుమార్, వారి సతీమణి Dr. మాసారం అవంతిక కు ఇద్దరికీ PHD పట్టా వచ్చిన సందర్భంగా తల్లిదండ్రుల, పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరికీ శాలువాతో సత్కరించి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవరకొండ భీఆర్ఎస్ సోషల్ మీడియా గుండాల వెంకట్ యాదవ్, నాగిళ్ల క్రిష్టఫర్ పాస్టర్, మాజీ సర్పంచ్ మాసారం ఆనంద్, విజయ్ ఆనంద్ పాల్, Sk నిరంజన్, రాజు, చెన్నయ్య, శ్యామ్ కుమార్, శివ, బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలి

- రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి చేస్తాం

**జయభేరి, దేవరకొండ :**



తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు ఆదేశాల మేరకు దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే బాలు నాయక్ ని మర్యాద పూర్వకంగా కలిసి వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెర కుల అభివృద్ధికి 1000 కోట్ల నిధులు కేటాయించేలా చూడాలని వినతి పత్రం అందజేసిన దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ. ఇరగదిండ్ల కృష్ణ మీడియాతో మాట్లాడుతూ వడ్డెర కుల అభ్యున్నత కోసం వడ్డెర కులాన్ని (BC) జాబితా నుండి తొలగించి (ST)జాబితాలో చేరుస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల వడ్డెర సంఘం బహిరంగ సభలో ప్రకటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మహబూబ్నగర్ ఎంపీగా ఉన్న సమయంలో వడ్డెర కులాన్ని (ST)లో చేర్చాలని కేంద్రానికి లేఖ రాశారు.స్వరాష్ట్రం ఏర్పడ్డాక ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వడ్డెర కులాన్ని (ST)లో చేర్చాలని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కి బహిరంగ లేఖ రాశారు.2018లో మెదక్ జిల్లా ముత్తంగి వడ్డెర సంఘం బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వడ్డెర కులాన్ని (ST)లో చేర్చుటకు అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపిస్తానని వడ్డెర కులానికి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000కోట్ల బడ్జెట్ కేటాయిస్తానని బహిరంగ సభలో ప్రకటించారు. జూడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ అనేక బహిరంగ సభలో వడ్డెర కులాన్ని (ST)జాబితాలో చేరు స్తామని ప్రకటించారు.కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టో 31వ పేజీ 5వ లైన్ లో వడ్డెర కులానికి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి సరిపడా నిధులు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పొందపరిచారు.

స్వరాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వడ్డెర్లను ఏనాడు పట్టించుకోలేదని. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశ్రయించారు కానీ మా వడ్డెర్ల ఓట్లను వేయించుకొని ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వడ్డెర్లను మర్చిపోయి వడ్డెర్లకు ఇచ్చిన హామీలు మర్చిపోయారు.ప్రభుత్వం ఏర్పడి 27నెలలు గడుస్తున్న వడ్డెర్ల అభ్యున్నత గురించి ఎక్కడ మాట్లాడిన దాఖలాలు లేవు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రేపు జరగబోయే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలలో వడ్డెర్ల గురించి ప్రస్తావించి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులు కేటాయించి వడ్డెర కులాన్ని (ST)జాబితాలో చేర్చుటకు అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని ఎడల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెర్లందర్నీ కూడగట్టుకొని అసెంబ్లీ ముట్టడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఇరగదిండ్ల వెంకటేష్, నేరడగొమ్ము మండల అధ్యక్షులు ఇరగదిండ్ల రాముడు ,అశోక్ వరికుప్పల రాముడు, ఓర్సు బిక్షపతి, వేముల గోవిందు వివేముల వెంకట్ రాములు వివిధ మండలాల వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వంద పడకల ఆసుపత్రి అభివృద్ధి శంకుస్థాపన

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల కల్పనకు రూ.5.31 కోట్లు

**జయభేరి, షాద్ నగర్, మార్చి 09 :**



ప్రజలకు మరింత సేవ చేయాలనే దృక్పథ్యంతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో వంద పడకల ఆసుపత్రిని అత్యధిక సదుపాయాలతో, పూర్తిస్థాయి వసతులతో నిర్మాణం చేపట్టబోతున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లింగారెడ్డిగూడెం శివారులోని అలీసాబ్ గూడ వద్ద నిర్మిస్తున్న నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల కల్పన కోసం అదనంగా రూ.5.31 కోట్లు ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఎమ్మెల్యే శంకర్ స్థానిక సర్పంచ్ ఎంసి. రాజు, ఉప సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో తన చేతులో మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ..... మంజూరైన నిధుల ద్వారా ఆసుపత్రిలో ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటు, మెడికల్ ల్యాండ్రీ, మోడ్రన్ కిచెన్ షెడ్, పార్కింగ్ షెడ్, మార్చురీ భవనం, బయో వేస్టేజ్ నిర్వహణ లను చేపడుతామని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి అత్యాధునిక వైద్యం ఇక్కడ అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే నిర్మాణం పనులు పూర్తి చేసి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, లింగారెడ్డి గూడా గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, గ్రామస్తులు కందూరి అంజయ్య గౌడ్, రంగంపల్లి రమేష్ గౌడ్, వార్డు సభ్యుడు మల్లేష్ యాదవ్, వీరేష్ గౌడ్, నరేందర్ రెడ్డి, మంగలి రమేష్, అరుణ్ కుమార్, మహమ్మద్, గంటల శంకరయ్య, పక్కనే నరేష్, గోద జంగయ్య, ఖదీర్, విగ్నేష్, బాలరాజు గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ఉత్సాహంగా 5కే రన్

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్, మార్చి 09 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 ప్రణాళిక కార్యాచరణలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 5కే రన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి పరుగును ప్రారంభించారు. పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ 5కే రన్, షాద్‌నగర్ ముఖ్య కూడలి వరకు సాగింది. ఆరోగ్య అవగాహన, ప్రభుత్వ లక్ష్యాల సాధన ధ్యేయంగా సాగిన ఈ పరుగులో విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. మార్గమధ్యలో యువత ఉత్సాహంగా నినాదాలు చేస్తూ పరుగును కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికల్లో ప్రజలను, ముఖ్యంగా యువతను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు వివరించాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- సొంతగూటికి చేరిన బండర్ పల్లి సర్పంచ్ భర్త బత్తుల సుజాత వెంకటేష్

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్న చింతకుంట మండలం బండ్రవల్లి గ్రామం నుండి బీజేపీ పార్టీ నుండి గెలుపొందిన సర్పంచ్ బత్తుల సుజాత భర్త వెంకటేష్ సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితోపాటు బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు భూపతి గౌడ్, రమేష్‌గౌడ్, బలిజ శంకరయ్య, దండు శాంతప్ప, ఎస్ నారాయణ, వాకిటి కృష్ణయ్య, ఎరుకలి రాము, సాకలి మొగిలన్న, కోట్ల తిరుపతయ్య, కె. శ్రీనివాసులు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే జిఎంఆర్ సాదరంగా ఆహ్వానించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జియంఆర్ పెద్ద ఎత్తున నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నచ్చి, అభివృద్ధిలో భాగ్యస్వాములు కావాలన్నా లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు.ఈ కార్యక్రమంలో రాజా రవికాంత్ రెడ్డి, వెంకటరెడ్డి, చిత్తూరు ఆంజనేయులు, కోట్ల ఎల్లప్ప, పల్లె సాయిలు పాల్గొన్నారు.

# చౌక్లా తండా గ్రామపంచాయతీ సమస్యలను పరిష్కరించాలి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 09 :**

తుర్కపల్లి మండలం చౌక్లా తండ గ్రామపంచాయతీ సమస్యలను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ భూక్య రాజారాం నాయక్ అన్నారు. సోమవారం భువనగిరి పట్టణ కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇండ్ల నష్టపరిహారాన్ని త్వరగా ఇప్పించాలని, పునరావాస నూతన గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి త్వరగా అభివృద్ధి చేయాలని, పట్టా భూముల నష్టపరిహారాన్ని త్వరగా చెల్లించాలని ఇప్పటివరకు 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు, బతుకుదెరువు కోసం వలస వచ్చిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి త్వరలోనే మీ గ్రామంలో పర్యటించి సాధ్యమనేంత తొందరగా మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్య శీను లాలోజి, భూక్య వెంకటేష్ , భూక్య మధు, భూక్య రామకోటి, భూక్య మోతీరాం భూక్య బాలు, భూక్యరాజు, భూక్య బిచ్చు, గ్రామస్తులు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

# నిర్విఘ్నంగా దేవరకొండ నియోజక వర్గం అభివృద్ధి

- ప్రజా ప్రభుత్వంలో ప్రతి సెంటుగుంటకు సాగునీరు.
- 10కోట్ల రూపాయలతో 10,000మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వ్యవసాయ గోదాం.

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలోని 11వ వార్డు శేరిపల్లి రోడ్డు రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ నిధుల నుండి మంజూరైన 10కోట్ల రూపాయలతో 10, 000మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నూతనంగా నిర్మించనున్న వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ శ్రీ రాయల నాగేశ్వర్ రావు గారు , అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మౌలిక వసతులు మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు మరియు వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సదుపాయం కల్పించడంలో ఈ గోదాం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గోదాం నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి గుండు కొట్టించిన ప్రిన్సిపల్

**జయభేరి, మియాపూర్ :**

మియాపూర్ హాఫీజ్ పేట్ లో దారుణం జరిగింది. జుట్టు ఎక్కువగా ఉందని విధ్యార్థికి ప్రిన్సిపాల్ గుండు కోట్టించిన ఘటన వివాదానికి దారి తీసింది. మొక్కు ఉండగా తమ కుమారుడికి గుండు కోట్టించడంపై స్కూల్ ముందు విధ్యారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ప్రేం నగర్ బిబ్లాక్ లోని బ్లాక్ బోర్డు ది స్కూల్ లో ఈశ్వర్ అనే విధ్యార్థి తోమ్మిదోవ తరగతి చదువుతున్నాడు. జుట్టు ఎక్కువగా ఉండటంతో జుట్టు కత్తిరించుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ సూచించారు. లక్ష్మి నరసింహ స్వామి మొక్కు ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ కు మొక్కు ఉందని విధ్యార్థి చెప్పాడు. దాంతో ప్రిన్సిపల్ మరుసటి రోజు బలవంతంగా విద్యార్థికి గుండు కోట్టించారు.




# యాదగిరిగుట్టలో 5కె రన్

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి09 :**

ప్రజాపాలన 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలో 5కె రన్ నిర్వహించారు. రన్‌లో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పట్టణంలోని పాదాల దగ్గర నుండి గుండ్లపల్లి వరకు 5కె రన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 5కె రన్‌లో గెలుపొందిన వారికి బీర్ల అయిలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మరింత చేరువవుతున్నాయని తెలిపారు. ఆరోగ్యం, ఐక్యత, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్, బబ్బూరి శ్రీధర్, బూడిద మధు, కాంగ్రెస్ నేతలు కాటబత్తిని ఆంజనేయులు, బిట్టు హరీష్, గౌలీకార్ రాజేష్, బరిగె రాంచందర్, బందారపు భిక్షపతి, సుడుగు జీవన్‌రెడ్డి, నేతలు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**కంపోస్ట్ తయారీపై అవగాహన..**

ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలోని 5వ వార్డు పార్కులో కంపోస్ట్ ఎలా తయారు చేయాలనేదానిపై స్థానికులకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిఎంఎ జాయింట్ డైరెక్టర్ త్రిలేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.లింగస్వామి, ఎస్సై సురేందర్,శానిటేషన్ సిబ్బంది,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- సమాజంలో మహిళల పాత్ర కీలకం - మున్సిపల్ చైర్మన్ జాం రవి



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 9:**

దేశ ప్రగతిలో మహిళల పాత్ర కీలకం అని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం చైర్మన్ జామ్ రవి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. మహిళలు శక్తికి ప్రతి రూపం అని, సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు మహిళల సేవలను గౌరవిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో కమిషనర్ పవన్ కుమార్, కౌన్సిలర్లు దోసకాయల లత, పెద్దిరెడ్డి శ్రీలత, రాజీగాళ్ల లత, మేడబోయిన మౌనిక, చిన్నలచ్చ సరిత, కొంపల్లి మాధవి, జంగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మరియు అంగన్వాడీ టీచర్స్ & మేనేజర్ ఉష, ఆర్వో హర్షద్, ఆర్ ఐ లు రాజేశ్వర్ రెడ్డి, గౌతమి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్, డి ఈ స్ఫూర్తి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యుడ్ని కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

రాజ్యసభ సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సోమవారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ఆకాంక్షలను పెద్దల సభలో సమర్థవంతంగా వినిపిస్తూ, తన అపార అనుభవంతో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజేషన్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు జి. భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ బాల కోటి తదితర నాయకులు పాల్గొన్నారు.

# దేవరకద్ర సమస్యలు పరిష్కరించండి




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ కోరారు. ఈ సందర్భంగా కౌకుంట్ల మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. అంతేకాకుండా నియోజకవర్గంలో కొత్తగా 7 పిఎసిఎస్ లు ఏర్పాటు చేయాలని, పేరూరు, చౌదర్ పల్లి గ్రామాలలో కొత్తగా ఏఈఓ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, దేవరకద్ర, కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రాలలో ఏడిఏ కార్యాలయాలను మంజూరు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. దీనికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.



## అది కామెడీ కాదు.. మూర్ఖత్వం


దళపతి విజయ్ విడాకుల వివాదం చల్లారకముందే.. విజయ్, త్రిష కలిసి ఓ వివాహ వేడుకకు హాజరు కావడం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై ఎవరికి తోచినట్టు వాళ్లు సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. టాలీవుడ్ నటుడు పార్తిబన్ ఓ ఈవెంట్‌లో ఈ విషయంపై ప్రస్తావిస్తూ 'ఆమె కొన్ని రోజులు ఇంట్లోనే ఉండటం మంచిది. బయటకొస్తే ఎక్కడలేని సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది' అన్నారు. ఈ వ్యాఖ్యలపై త్రిష తన సోషల్ మీడియా ద్వారా పరోక్షంగా స్పందిస్తూ.. 'చేతిలో మైక్ ఉంది కదా అని ఏదిపడితే అది మాట్లాడితే కామెడీ అవ్వదు. మూర్ఖత్వం అవుతుంది..' అంటూ కౌంటరిచ్చింది. దాంతో గతుక్కుమన్న పార్తిబన్ వెంటనే మరో పోస్ట్ పెట్టారు. 'ఈ విషయంలో నేను మాట్లాడింది తప్పుగా అర్థం చేసుకున్నారు. ఇప్పుడు నాకు పశ్చాత్తాపపడటం తప్ప మరో మార్గం లేదు' అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వీరిద్దరి స్టేట్మెంట్లు ప్రస్తుతం తమిళనాట వైరల్‌గా మారాయి.



## 20రోజులకు 150కోట్లు

ఫ్రాంచైజీల్లో తొలి పార్ట్‌కు 11వందలకోట్ల పైచిలుకు వసూళ్లు రావడం కేవలం 'కల్కి 2898ఏడీ' సినిమా విషయంలోనే జరిగింది. ప్రస్తుతం ఆ సినిమా సీక్వెల్‌కు సంబంధించిన షూటింగ్ హైదరాబాద్‌లో నిశ్శబ్దంగా జరుగుతున్నది. అశ్వత్థామ, కలిపురుషుడు యాస్కిన్ పాత్రలపై కీలక యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు నాగ్అశ్విన్ తెరకెక్కిస్తున్నారు. అశ్వత్థామగా అమితాబ్, యాస్కిన్‌గా కమల్‌హాసన్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఎక్కడా బాడీ డబుల్స్‌ని ఉపయోగించకుండా వారు ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నటిస్తున్నట్టు చిత్రబృందం చెబుతోంది. ఇదిలావుంటే.. కమల్‌హాసన్ ఫ్యామిలీ ఫ్రెండ్ అయిన నటుడు యోగిసేతు ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'కల్కి 2'లో కమల్ పాత్ర, పారితోషికం తదితర అంశాల గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ' 'కల్కి 2898ఏడీ'లో కమల్‌హాసన్ పాత్ర నిడివి చాలా తక్కువ. కానీ 'కల్కి 2'లో మాత్రం అందరికంటే ఆయన పాత్రే ఎక్కువగా ఉంటుంది. ఈ సినిమాకు 20 రోజుల కాల్షీట్స్‌కి గాను ఆయన 150కోట్లు పారితోషికంగా తీసుకున్నారు. దీంతో భారతదేశంలోనే అత్యధిక పారితోషికం అందుకున్న నటుడిగా కమల్‌హాసన్ అవతరించారు. రీసెంట్‌గా నిర్మాత సి.అశ్వనీదత్‌ని కమల్ సార్ నాకు పరిచయం చేశారు. నేను ఆయనకు ఈ విషయంపై కృతజ్ఞతలు తెలిపాను' అని యోగిసేతు అన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## కొత్త కథకు గ్రీన్ సిగ్నల్?



ఇటీవలే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన అగ్రహీరో విజయ్ దేవరకొండ.. నిదానంగా మళ్లీ కెరీర్‌పై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు సినిమాలున్నాయి. వాటిలో ఒకటి రాహుల్ సంకృత్యాన్ 'రణబాలి' కాగా, రెండోది రవికిరణ్ కోలా 'రౌడీ జనార్దన'. ప్రస్తుతం ఈ రెండు సినిమాలూ నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా విజయ్ మరో సినిమాకు సంతకం చేసినట్టు తెలుస్తోంది. నానితో 'హాయ్ నాన్న' వంటి ఎమోషనల్ లవ్‌స్టోరీని తెరకెక్కించిన శౌర్యువ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారట. నిజానికి 'హాయ్ నాన్న' తర్వాత ఎన్టీఆర్ కోసం ఓ కథ రాసుకున్నాడు శౌర్యువ్. తారక్‌కు ఉన్న కమిట్‌మెంట్స్ వల్ల అది వర్కవుట్ కాలేదు. ఇప్పుడు అదే కథను విజయ్‌కు వినిపించాడని, విజయ్‌కు కూడా కథ నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఓ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. 'హాయ్ నాన్న' వంటి క్లాస్ మూవీతో ప్రేక్షక హృదయాలను టచ్ చేసిన శౌర్యువ్.. ఈసారి మాత్రం భారీ యాక్షన్ స్క్రిప్ట్‌నే సిద్ధం చేశాడట. ప్రతిష్టాత్మక కెవిఎన్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నదని సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానున్నది.

### ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేస్తోన్న..

## భర్త మహాశయులకు విజ్ఞప్తి




మాస్ మహారాజా రవితేజ బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరిస్తున్నారు. ప్రస్తుతం ఇరుముడి సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చారు. డైరెక్టర్ కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమాను నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. రవితేజ ప్రధాన పాత్రలో నటించగా.. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా అలరించారు. ఇందులో సునీల్, సత్య, మురళీధర్ గౌడ, రోహన్, సోనియా సింగ్ కీలకపాత్రలు పోషించారు. సంక్రాంతి పండక్కి వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. దాదాపు 40 కోట్లతో నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కేవలం 30 కోట్ల వరకు రాబట్టినట్లు సమాచారం. ఇదిలా ఉంటే సంక్రాంతి విడుదలైన సినిమాలన్నీ ఓటీటీలోకి వచ్చేశాయి. కానీ భర్త మహాశయులకు విజ్ఞప్తి మాత్రం డిజిటల్ ప్లాట్ ఫామ్ పైకి రాలేదు. ఇప్పుడు ఎట్టకేలకు ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్ గురించి అధికారిక ప్రకటన వచ్చేసింది. మార్చి 13 నుంచి ఈ మూవీని ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ జీ5లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలలోనూ ఈ సినిమా అందుబాటులో ఉండనున్నట్లు వెల్లడించారు. విడుదలైన రెండు నెలలకు ఈ సినిమాను ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తున్నారు. కథ విషయానికి వస్తే.. రామ సత్యనారాయణ (రవితేజ) ఓ వైన్ యార్డ్ ఓనర్. కొత్తగా రెడీ చేసిన అనార్కలి వైన్ ను స్పెయిన్ లోని ఓ కంపెనీకి శాంపిల్ పంపిస్తే వాళ్లు రిజెక్ట్ చేస్తారు. కారణం తెలుసుకోవడానికి వెళ్లిన రామ్.. అక్కడే వర్క్ చేస్తున్న ఎండీ మానసా శెట్టితో ఫిజికల్ గా దగ్గరవుతాడు. అప్పటికే పెళ్లైన రామ సత్యనారాయణ తన భార్య బాలామణి (డింపుల్ హయతి) దగ్గర సీక్రెట్ గా ఉంచుతాడు. ఆ తర్వాత రామ సత్యనారాయణ జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి అనేది సినిమా. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీలో విడుదల కానుంది.



## మాతృభాషంత స్వచ్ఛంగా మాట్లాడుతున్నా

తెలుగులో స్టార్‌డమ్‌ని అనుభవిస్తూ కూడా తెలుగు నేర్చుకోవాలనే సోయి ఉండదు కొందరు కథానాయికలకు. ప్రస్తుతం ఉన్న కథానాయికల్లో నిత్యామీనన్, సాయిపల్లవి, కీర్తిసురేశ్, రష్మిక మందన్న, అనుపమ పరమేశ్వరన్.. తదితర తారలు మాత్రం చక్కగా తెలుగు నేర్చుకొని, తమ పాత్రలకు తామే డబ్బింగ్ చెప్పుకుంటూ, ఆదరించిన భాషపై అభిమానం చూపిస్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి సంయుక్త మీనన్ కూడా చేరింది. రీసెంట్‌గా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడిన తెలుగు అందరిని ఆకట్టుకుంది. ఆ క్లిప్‌లు నెట్టింట వైరల్‌గా మారాయి. 'తొలిరోజుల్లో నాకు అసలు తెలుగు రాదు.

'విరూపాక్ష' చేస్తున్న టైమ్‌లో తెలుగు నేర్చుకోవాలని ఫిక్సయ్యాను. నేర్పేందుకు ట్యూటర్లను పెట్టుకున్నాను. వారివల్లే ఇంత త్వరగా మాట్లాడగలుగుతున్నా. ప్రస్తుతం తెలుగు నా మాతృభాషలాగే మారిపోయింది. ఇకపై నా పాత్రలకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటా' అంటూ గర్వంగా చెప్పుకొచ్చింది సంయుక్త మీనన్. భీమ్లానాయక్, బింబిసార, సార్, విరూపాక్ష, నారీనారీ నడుమ మురారి.. ఇలా ఆమె చేసిన సినిమాలన్నీ దాదాపు విజయాలే. ఆమె నటించిన స్వయంభు, స్లమ్‌డాగ్ చిత్రాలు త్వరలో విడుదల కానున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**